

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా సుదర్శన నారసింహహోమం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 25 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో గురువారం సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు.

సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ, రాత్రి తిరువారాధన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. ---- ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భువనగిరి.. జన సంద్రం

- గులాబీమయమైన రహదారులు
- వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు
- కేసీఆర్ బస్సుపై పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం భువనగిరిలో నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో భువనగిరి పట్టణం జనసంద్రమైంది. రోడ్లన్నీ గులాబీమయంగా మారాయి. కేసీఆర్‌ను చూడగానే ప్రజలు ఆనందంతో కేరింతలు కొట్టారు. తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీశారు. మధ్యాహ్నం నుంచే భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల నుంచి ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా భువనగిరికి చేరుకున్నారు. సాయంత్రం భువనగిరి పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. సాయంత్రం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సులో భువనగిరికి చేరుకోగానే దారి పొడవునా పూలు జల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమైన రోడ్‌షోలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ నూతనోత్తేజాన్ని నింపారు. కేసీఆర్ బస్సు వెంట వేలాదిమంది ప్రజలు, కార్యకర్తలు ర్యాలీగా ముందుకు సాగారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం

భువనగిరి పట్టణంలో నిర్వహించిన కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. నియోజకవర్గం నుంచి ప్రజలు ముఖ్యంగా రైతులు అధిక సంఖ్యలో పాల్గొనడం పార్టీ శ్రేణుల ఉత్సాహం రెట్టింపైంది. బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు గులాబీ జెండాలతో కేసీఆర్ బస్సుయాత్రకు స్వాగతం పలికారు. ఒగ్గు, డప్పు కళాకారులు, ఖవ్వాలీ పాటలు, చెంచు నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బోనాలు, కోలాటాలు, మహిళల ఆటాపాటలు అలరించారు.



భువనగిరి వినాయక చౌరస్తాలో రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

భువనగిరిలో కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని

భువనగిరి రోడ్‌షోలో కళాకారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, పక్కన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్

కేసీఆర్ రోడ్‌షో సైడ్‌లైట్స్

- సాయంత్రం 5.50 గంటలకు భువనగిరి వివేరా హోటల్‌కు చేరుకున్న మాజీ సీఎం కేసీఆర్
- సాయంత్రం 7 గంటలకు రోడ్‌షో ప్రారంభం
- భువనగిరి వినాయకచౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోకు సాయంత్రం 7.35 గంటలకు చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- కార్నర్ మీటింగ్‌లో 26 నిమిషాలు ప్రసంగించిన మాజీ సీఎం
- రాత్రి 8.18 గంటలకు భువనగిరి నుంచి వాసాలమర్రి మీదుగా ఎర్రవెల్లికి 8.54 గంటలకు చేరుకున్నారు.
- కేసీఆర్ కార్నర్ మీటింగ్‌కు బస్సు నుంచి బయటికి వస్తుండగానే అభిమానులు పెద్ద ఎత్తున చప్పట్లు, ఈలలు వేశారు.
- కేసీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు ఆసక్తిగా విన్న ప్రజలు.. ఆయన అడిగిన ప్రతి విషయానికి సమాధానం చెప్పారు.
- మాజీ ముఖ్యమంత్రిని చూసేందుకు రోడ్డు వెంట ఉన్న భవనాల మీదికి ఎక్కిన అభిమానులు

–భువనగిరి అర్బన్, ఏప్రిల్ 25

రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

రోడ్డువెంట నిలబడి కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

బస్సు యాత్రలో నృత్యం చేస్తున్న కళాకారులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

భవనం పైకెక్కి మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం వింటున్న స్థానికులు

మాజీ సీఎం కేసీఆర్‌ను చూసేందుకు ఓ కుటుంబం ప్రయత్నం

ఎన్నికల కంట్రోల్ రూం పరిశీలన

కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షత్రిమయుమ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 25 : ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షత్రిమయుమ్ గురువారం కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా సీ విజిల్, ఫిర్యాదుల నమోదు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీల పనితీరు, వివిధ సర్వేలెన్స్ టీమ్‌ల పనితీరును పరిశీలించారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, ఐటీ నోడల్ అధికారి గూడ వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారామ్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి ఉన్నారు.

నర్సరీలో అన్ని రకాల మొక్కలు పెంచాలి : ఎంపీడీఓ

కోరటికల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిరంజన్‌వలి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 25 : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచాలని ఎంపీడీఓ నిరంజన్‌వలి ఆదేశించారు. గురువారం మండలంలోని కోరటికల్ గ్రామ నర్సరీని ఆయన పరిశీలించారు. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు నీళ్లు అందించాలని, ఎండ నుంచి రక్షణ కోసం షేడ్ నెట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్, టీఏ యాదిరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ సుమలత ఉన్నారు.

జిబ్లక్ పల్లిలో బొడ్రాయి పండుగ

గ్రామదేవతలకు బోనాలు సమర్పిస్తున్న మహిళా భక్తులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని జిబ్లక్ పల్లి గ్రామంలో గురువారం బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు దేవుడు మండేలమ్మా సీతాదేవి, ఈదమ్మకు, బొడ్రాయికి బోనాలు సమర్పించారు. బొడ్రాయికి మహిళలు జలాభిషేకం చేశారు. సందర్భంగా డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామా మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ చిన్న లచ్చి లింగస్వామి, ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి యాదవ్, నాయకులు పూజలు నిర్వహించారు.

వ్యర్థ రసాయనాల పారబోతపై పీసీబీకి ఫిర్యాదు

- పరిశీలించిన పీసీబీ ఈఈ సురేశ్

హేజో కంపెనీలో వ్యర్థ రసాయన పదార్థాలను పరిశీలిస్తున్న పీసీబీ ఈఈ సురేశ్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని ధోతిగూడెంలో ఉన్న హెజోలో కంపెనీ వారు వ్యర్థ రసాయన పదార్థాలను గురువారం ఆరుబయట పారపోస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పీసీబీ ఈఈ సురేశ్ కంపెనీని సందర్శించారు. కంపెనీలోని పలు విభాగాలను, వ్యర్థ రసాయన పదార్థాలను పారబోస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశంలోని నీటి షాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి షాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వ్యర్థ రసాయనాలను ఆరుబయట పారబోస్తున్న హెజోలో కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ సర్పంచ్ బాలం మల్లేశ్, నాయకుడు ముద్దం సత్యం, గ్రామస్తులు కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. కాలుష్యం వెదజల్లుతున్న హెజోలో కంపెనీని వెంటనే మూసి వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పీసీబీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఉపాధిహామీ పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలు

శారాజీపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ముత్యాలు

ఆలేరురూరల్, ఏప్రిల్ 25 : ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని శారాజీపేటలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి రూ.300 వచ్చేలా వందరోజులు పని కల్పించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, గ్రామ కార్యదర్శి దూడల లింగం ఉన్నారు.

మోటకొండూర్ నుంచి కేసీఆర్ రోడ్‌షోకు బయల్దేరిన నార్మూల్ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, నాయకులు

మోత్కూరు నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన నాయకులు

మోటకొండూర్, ఏప్రిల్ 25: భువనగిరిలో జరుగనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోకు మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, రైతులు నార్మూల్ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, ఎంపీపీ పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు బురాన్, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, బొట్ల శ్రీనివాస్, ఉప్పలయ్య, నాగులు ఉన్నారు. మోత్కూరు : మండల, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొణతం యాకూబ్‌రెడ్డి, తీపిరెడ్డి మేఘారెడ్డి, నాయకులు జంగ శ్రీను, కొండ సోంమల్లు, కంచర్ల అశోక్‌రెడ్డి, అవిశెట్టి స్వామి, మల్లం అనిత, రైతులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమైతాంది

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా ఆగమైతాంది. సాగు, తాగు నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ఏ పథకం సక్కగ ఇస్తలేరు. గతంలో కేసీఆర్ పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండె. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చినరు. కానీ ఇప్పుడు అస్పలు బాగలేదు. ప్రజలంతా ఉక్కిరి బిక్కిరి అవుతున్నరు. మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలంతా కోరుకుంటున్నరు. అందుకే ఆయన బస్సు యాత్ర, రోడ్‌షో చేపడుతు ప్రాంతానికి వేలాదిగా వస్తున్నరు. జనాలంతా ఆయనకే మద్దతు తెలుపుతున్నరు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం.

–గునగంటి సైదులుగౌడ్, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం

కేసీఆర్ సారు దేవుడసోంటోడు

కేసీఆర్ సారు దేవుడసోంటోడు. ప్రజలను సొంత బిడ్డల్లెక్క చూసుకుండు. అనేక పథకాలను ఇచ్చి మాలాంటి పేదోళ్ల గుండెల్లో నిలిచిపోయిండు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి ప్రజలు ఓటేసి నందుకు గిప్పుడు బాధ పడుతున్నరు. గిప్పుడు ప్రభుత్వం నుంచి పేదలకు ఏం వస్తలేదు. నీళ్లు, కరెంటు సరిగ ఇస్తలేరు. పింఛన్లు పెంచలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే బాగుండె. మళ్లీ ఆయనే రావాలి.

–రేగు గౌరమ్మ, వీరవెల్లి, భువనగిరి మండలం

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

59 మంది అభ్యర్థులు.. 110 సెట్ల నామినేషన్

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకరణ గడువు గురువారం ముగిసింది. ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. వివిధ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు కె. జెండగేకు నామినేషన్లు సమర్పించారు. ఇప్పటి వరకు 59మంది అభ్యర్థులు 110 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి వై.పాపారావు

మలేరియా నివారణకు సహకరించాలి

- జిల్లా వైద్యాధికారి పాపారావు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 25: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్యాధికారి వై. పాపారావు కోరారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని పట్టణంలోని ఏరియా దవాఖాన వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి మలేరియా రహిత భారత్‌గా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు రామకృష్ణ, సుమన్‌కళ్యాణ్, వంశీకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ యామిని, ఏఎంఓ ఎన్. మధుమోహన్‌రావు, ఇస్తారి, డిప్యూటీ డీఎంఓ మధుసూదన్‌రెడ్డి, సాయిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్, ఏప్రిల్ 25 : ఉపాధిహామీ పథకం కింద ప్రతి గ్రామంలో 100 మందికి తగ్గకుండా పనికి వచ్చేలా చూడాలని, కూలీలకు రోజుకు రూ. 250 వేతనం వచ్చేలా చూడాలని జడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీబీనగర్, పోచంపల్లి మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను అధికారులు ఫీల్డ్‌కు వెళ్లి తనిఖీ చేయాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ వసతి కల్పించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో తాగునీరు సరఫరాకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.